సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 12 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.9

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/21.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

2 వేల నోటు మార్పునకు రేపే చివరి అవకాశం



హిందూపురం అర్బన్: రూ.2 వేల నోటు మార్చుకునేందుకు రేపు ఒక్క రోజే గడువు మిగిలింది. 2000 నోటు చెల్లుబాటుకు ఈ నెల 30ని డెడ్‌లైన్‌గా రిజర్వుబ్యాంకు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంకా ఎవరి వద్దనైనా రూ.2 వేల నోట్లు ఉంటే వెంటనే మార్చుకోవాలని బ్యాంకర్లు సూచిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది తమ వద్ద ఉన్న నోట్లను బ్యాంకుల్లో మార్చుకున్నారు. ఈ ఏడాది మే 19న రూ.2 వేల నోట్లు రద్దు చేస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే.


రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు 'పురం' విద్యార్థి



మెమెంటో అందుకుంటున్న విద్యార్థి మిథున్

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ధర్మవరంలో ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలు జరిగాయి. ఇందులో భాగంగానే పట్టణానికి చెందిన విద్యార్థి మిథున్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకృష్ణ, చెస్ కోచ్ ఆరీఫుల్లా తెలిపారు. మిథున్ 7 గేములకు గాను 6 గేముల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. అక్టోబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మిథున్ పాల్గొంటారని పేర్కొన్నారు. బుధవారం ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో మిథున్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

చెర్లోపల్లి రిజర్వాయర్‌కు నీటి విడుదల



ఎగువపల్లి పంప్ హౌస్ వద్ద రిజర్వాయర్‌కు వెళ్తున్న నీరు

కదిరి అర్బన్: మండల పరిధిలోని చెర్లోపల్లి రిజర్వాయర్‌కు గురువారం హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు హంద్రీనీవా ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుత రిజర్వాయర్ స్టోరేజీ 1.1 టీఎంసీ నీరు ఉందని జేఈ పాండురంగ తెలిపారు. పూర్తిస్థాయి స్టోరేజీ 1.6 టీఎంసీలన్నారు. 1.4 స్టోరేజీ వరకు నీరు వస్తే దిగువకు వదులుతామని పేర్కొన్నారు.

నవోదయలో వెయిటింగ్ విద్యార్థుల జాబితా విడుదల

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వెయిటింగ్ విద్యార్థుల జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. వెయిటింగ్ విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి.
ఈ-1000177, ఈ-1004439, బి-1000055, బి-1000140, సి-1001360, సి-1005501, ఐ-1000472, ఐ-1002414, పి-1001090, ఎం-1002901, జే-1005292, జే-1005578, జే-1003279, ఎస్-1008046, కే-1007151, ఎల్-1002056.



❐ నెల రోజుల క్రితం కదిరికి చెందిన డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు ఇంట్లో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళితే హార్ట్‌ఎటాక్ అని తేలింది. ఇంత చిన్న వయసులో గుండెపోటు రావడమేంటని వైద్యులే ఆశ్చర్యపోవాల్సి వచ్చింది.

❐ వారం రోజుల క్రితం అనంతపురానికి చెందిన 33 ఏళ్ల ఐటీ ఉద్యోగి గుండె నొప్పిగా ఉందని ఓ ఆస్పత్రికి వెళ్లారు. ఇంతలోనే సమస్య తీవ్రమైంది. చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. కారణమేమంటే తీవ్రమైన గుండె పోటు అని వైద్యులు చెప్పారు.



హృదయ వేదన విందాం!

- పెరుగుతున్న హార్ట్ ఎటాక్ బాధితులు
- చిన్న వయసులోనే గుండెపోటు బారిన పడుతున్న వైనం
- ఆరోగ్యశ్రీలో గుండె జబ్బులకే 30 శాతం ప్రభుత్వ వ్యయం
- సమతుల ఆహారం తీసుకోక, వ్యాయామం లేక ఆరోగ్యానికి చేటు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

సందర్భం నేడు వరల్డ్ హార్ట్ డే

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జీవన శైలి మార్పులు, ఆహార సమతుల్యత పాటించకపోవడం వెరసి గుండెకు పెనుముప్పు తెచ్చిపెడుతున్నాయి. గుండె జబ్బు ఒక్కసారే వచ్చి పడేది కాదు. అంతకుముందు ఎన్నో సంకేతాలు చిట్టి గుండె నుంచి వస్తూ ఉంటాయి. జాగ్రత్త పడమని సూచిస్తుంటాయి. అయితే, వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం చేటు తెస్తోంది. చివరికి ప్రాణాలూ తోడేస్తోంది. రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లలో 3 వేల పైగా జబ్బులకు రూ.450 కోట్లు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఖర్చు చేస్తే, అందులో రూ.129 కోట్లు పైగా గుండెజబ్బులకే కేటాయించడం చూస్తే పరిస్థితి తీవ్రతను అంచనా వేయచ్చు.

పల్లెలకూ పాకిన మాయదారి జబ్బు..

ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా గుండె పోటు కేసులు వచ్చేవి. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ జీవనశైలి జబ్బులు ఎగబాకడం విస్మయం కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రతి పది మందిలో ఒకరు గుండె సంబంధిత సమస్యను ఎదుర్కొంటున్నట్టు ఇండియన్ కార్డియాలజీ సొసైటీ ఇటీవల హెచ్చరించింది. జాగ్రత్తలు పాటించడంలో కనబరిచే నిర్లక్ష్యమే శాపమవుతోందని స్పష్టం చేసింది.

యువకుల్లోనూ..

ఒకప్పుడు 55 ఏళ్లు దాటితేగానీ గుండె సంబంధిత జబ్బులొచ్చేవి కావు. కానీ నేడు 35 ఏళ్లకే గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. గుండెపోటును సైలెంట్ కిల్లర్‌గా వైద్యులు అభివర్ణిస్తున్నారు. గుండె పోటుకు రకరకాల కారణాలు చుట్టుముడుతున్నాయి. మధుమేహం, రక్తపోటు వంటివి కూడా ఆజ్యం పోస్తున్నట్టు హృద్రోగ నిపుణులు పేర్కొంటున్నారు.

గుండె జబ్బులకు ప్రధాన కారణం..

- పొగాకు, ఆల్కహాల్ విపరీతంగా తీసుకోవడం
- అధిక రక్తపోటు ఉంటే, నియంత్రణలో ఉంచుకోలేకపోవడం
- చెడు కొలెస్ట్రాల్ అంటే ఎల్‌డీఎల్ (లో డెన్సిటీ లిపిడ్స్) ఉండటం
- శరీరంలో ఉండాల్సిన దానికంటే ఎక్కువ నూనెల (ట్రైగ్లిజరాయిడ్స్) శాతం
- వయసుకు, ఎత్తుకు మించి బరువు (ఊబకాయం)
- మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడంలో నిర్లక్ష్యం
- కుటుంబ చరిత్ర ప్రభావం

కాపాడుకోవాలి ఇలా

- రోజూ 40 నిముషాలకు తగ్గకుండా వ్యాయామం.
- కొవ్వులున్న ఆహారం తగ్గించి పీచు ఆహారం ఎక్కువగా తీసుకోవడం (కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, చిరు ధాన్యాలు)
- బరువును అదుపులో ఉంచుకోవడం. ఒత్తిడి తగ్గించుకోవడం
- ఆరుమాసాలకోసారి 2డీ ఎకో వంటివి చేయించడం
- చెడు కొలెస్ట్రాల్‌ను గుర్తించేందుకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించడం
- బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవడం

వ్యాయామమే శ్రీరామరక్ష

గుండెజబ్బుల రాకుండా ఉండాలంటే రోజూ 40 నిముషాల నడక లేదా జాగింగ్, స్విమ్మింగ్ చేయాలి. కూల్‌డ్రింక్స్ తీసుకోకూడదు. రోజుకు 3 గ్రాములకు మించి ఉప్పు, నెలకు 500 మిల్లీ లీటర్ల మించి ఆయిల్ వాడకూడదు. ముఖ్యంగా పదే పదే మరిగించిన నూనెతో చేసినవి తింటే గుండెకు ఎక్కువ ముప్పు ఉంటుంది. పొగతాగడం, మద్యం అనేవి ఎప్పుడూ గుండెకు శత్రువులే.

–డాక్టర్ వంశీకృష్ణ, హృద్రోగ నిపుణులు, అనంతపురం

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకంలో గుండె జబ్బుల చికిత్స వివరాలు, వ్యయం.. (2019 జూన్- 2023 సెప్టెంబర్ 28)	
కార్డియాక్ అండ్ థొరాసిక్ సర్జరీలు	10,621
ప్రభుత్వం వ్యయం	రూ.65.75 కోట్లు
కార్డియాలజీ చికిత్సలు (స్టంట్ వంటివి)	18,276
ప్రభుత్వ వ్యయం	రూ.63.68 కోట్లు
హార్ట్ ఆపరేషన్లు	28,897
చేసిన వ్యయం	రూ.129.34 కోట్లు

ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం

ప్రస్తుత రోజుల్లో చిన్న వయసు వారికీ గుండె సమస్యలు తలెత్తుతున్నాయి. జంక్ ఫుడ్, మద్యం, ధూమపానంతోనే సమస్యలు తెచ్చుకుంటున్నారు. సూపర్ స్పెషాలిటీలో కార్పొరేట్ స్థాయిలో హృద్రోగులకు సేవలు అందిస్తున్నాం. అటువంటి శస్త్రచికిత్సలు ప్రైవేట్‌గా చేసుకోవాలంటే రూ.లక్షలు వెచ్చించాలి. ఇప్పటి వరకూ దాదాపు 400 వరకు ఆంజియోప్లాస్టీ,యాంజోగ్రామ్ ఆపరేషన్లు విజయవంతంగా చేశాం.

– డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, కార్డియాలజిస్టు

నేడు 'వైఎస్సార్ వాహన మిత్ర '



పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ వాహన మిత్ర పథకం అమలులో భాగంగా శుక్రవారం 5వ విడతను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆటో ,ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల అవసరాల నిమిత్తం ప్రభుత్వం వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఖాతాల్లో జమ చేయనుందని పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి గాను జిల్లాలో 5,666 మంది అర్హులకు రూ.5.66 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ శుభారంభం



హిమాచల్ ప్రదేశ్ - ఆంధ్రప్రదేశ్ మధ్య జరుగుతున్న మ్యాచ్

అనంతపురం: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు శుభారంభం చేసింది. అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో మూడు రోజులుగా మ్యాచ్‌లు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం ఆంధ్రప్రదేశ్- హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 1-0తో ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు మనోజ్ హిమాచల్‌ప్రదేశ్ కీపర్‌ను బోల్తా కొట్టించి గోల్ చేశాడు. అలాగే తమిళనాడు- ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-0తో తమిళనాడు, అస్సాం- లక్షదీప్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 8-1తో అస్సాం జయభేరి మోగించాయి. బిహార్ - అండమాన్ నికోబార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఏక పక్షంగా సాగింది. బిహార్ 13-0తో ఘన విజయం సాధించింది.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

ప్రశాంతి నిలయం: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్యసాయి భక్తులు గిరిప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ప్రశాంతి నిలయం తుర్పుగేట్ వద్ద సత్యసాయి గిరిరథాన్ని అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయిని భక్తిగీతాలు ఆలపిస్తూ రథాన్ని ముందుకు లాగుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనడంతో పుట్టపర్తి పట్టణ పురవీధుల్లో ఆధ్యాత్మిక శోభసంతరించుకుంది.



సత్యసాయి గిరిరథాన్ని లాగుతున్న భక్తులు

గుర్రం జాషువాకు ఘన నివాళి

పుట్టపర్తి అర్బన్: సమకాలిన, సామాజిక అంశాలపై తన కవిత్వంతో పోరాటం చేసిన గొప్ప సాహితీవేత్త గుర్రం జాషువా అని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. ప్రముఖ రచయిత, కవి, సాహితీవేత్త గుర్రం జాషువ జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అరుణ్‌బాబు, ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, డీఆర్ఓ కొండయ్య తదితరులు జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జాషువా 36 గ్రంథాలు రచించాడని పేర్కొన్నారు. కడు బీద కుటుంబంలో జన్మించిన గుర్రం జాషువా తన రచనలతో అంతర్జాతీయ స్థాయిలోగుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పశు సంవర్ధకశాఖ అధికారి శుభదాస్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

అంగన్‌వాడీ కేంద్రం మాయంపై విచారణ

- ఖాళీ స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ, ఐసీడీఎస్ పీడీ
- కార్యకర్తపై చర్యలకు సిఫారసు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం మాయంపై విచారణ ప్రారంభమైంది. గురువారం పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సీడీపీఓ గాయత్రి, రూరల్ పోలీసులు సదరు స్థలాన్ని పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం బత్తలపల్లి గ్రామంలో 1996 సంవత్సరంలో సర్వే నంబర్ 224లో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని అందులో పని చేసే అంగన్‌వాడీ కార్యకర్త గంటల వ్యవధిలో కూల్చివేసి శిథిలాలను మాయం చేశారు. తన తండ్రి కేంద్రానికి అవసరమైన స్థలాన్ని ఇచ్చాడని, ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం పాతపడటంతో కూల్చివేసినట్లు చెప్పారు. ఈ ఘటనపై 'అంగన్‌వాడీ కేంద్రం మాయం' అన్న శీర్షికన ఈనెల 27న 'సాక్షిలో' ప్రత్యేక కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ వార్తకు జిల్లా అధికారులు స్పందించారు.



స్థానికులతో విచారణ చేస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ, పీడీ లక్ష్మీకుమారి

పోలీసు కేసు నమోదు..

అంగన్‌వాడీ భవనం కూల్చివేత విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ అరుణ్‌బాబు గ్రామానికి వెళ్లి పరిశీలించి నివేదిక సమర్పించాలని పుట్టపర్తి ఆర్డీఓ, ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. దీంతో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సీడీపీఓ గాయత్రి, రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ విజయుడు గురువారం బత్తలపల్లి గ్రామానికి చేరుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త చెన్న క్రిష్ణమ్మతో పాటు చుట్టుపక్కల వారిని పిలిపించి విచారించారు. ప్రస్తుతం ఉన్న స్థలంలో బోర్డు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆర్డీఓ ఆదేశించారు. ఈ స్థలం ఐసీడీఎస్‌కు సంబంధించినదని, ఈస్థలంలోకి అనుమతి లేకుండా ఎవరు ప్రవేశించినా కఠిన చర్యలు తప్పవని బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఘటనపై పోలీస్ కేసు కూడా నమోదు చేయించినట్లు పేర్కొన్నారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శాఖాపరంగా విచారణ చేయించాలని, రిపోర్టును కలెక్టర్‌కు అందజేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. భవనాన్ని కూల్చివేసిన అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు ఆమె కుమారుడు లోకనాథ్ , జేసీబీ డ్రైవర్, శిథిలాలను తరలించేందుకు వాడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ పోలీసులను ఆదేశించారు.

సాక్షి ఎఫెక్ట్..

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పుట్టపర్తి టౌన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్-ఉన్-నబీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, దర్గాలు భక్తులతో కిటకిటలాడాయి. సామూహిక ప్రార్థనలతో పాటు శాంతి ర్యాలీలు నిర్వహించారు. మసీదుల్లో ప్రవక్త కేశ దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రవక్త బోధనలను మత పెద్దలు వివరించారు. శాంతి, ధర్మం, సమానత్వం, తోటివారితో ఎలా మెలగాలో చెప్పారు.

జిల్లాలో మోస్తరు వర్షం





మడకశిరలో వర్షం కురుస్తున్న దృశ్యం, చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్ట్ 44వ నంబరు జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వర్షపు నీరు

చిలమత్తూరు: జిల్లాని పలు నియోజకవర్గాల్లో గురువారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మడకశిరలో సాయంత్రం భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్ట్‌లో 44వ నంబర్ జాతీయ రహదారిపై వర్షపు నీరు భారీగా చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కర్ణాటకలో కూడా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఈ ఏడాది కూడా నదులు ఉప్పొంగే అవకాశం ఉంది. వర్షం రాకతో వాతావరణం చల్లగా మారడంతో ఉక్కపోత నుంచి జనం ఉపశమనం పొందారు.

అనంతపురం సీడీ ఆస్పత్రికి మహర్దశ

- రూ.11.02 కోట్లతో నూతన భవనం ఏర్పాటు

అనంతపురం మెడికల్: అనంతపురం జిల్లా కేంద్రంలోని రాణీనగర్, మున్నానగర్, రాజమ్మ కాలనీ, అంబేడ్కర్‌నగర్, వినాయకనగర్, భాగ్యనగర్, తదితర పాతూరు ప్రాంతాల్లోని 30 వేల మంది ప్రజలకు ఆ ఆస్పత్రే దిక్కు. అయినా కూడా పాతూరు సీడీ ఆస్పత్రి (ఛాతీ వ్యాధుల ఆస్పత్రి) అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం వైఎస్ జగన్ నాయకత్వం, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నాబార్డు నిధులు రూ.11.02 కోట్లతో పాతూరు చెస్ట్ డిసీస్ (సీడీ) ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే, ఎంపీలు ప్రారంభించనున్నారు.



పాతూరులో కొత్తగా నిర్మించిన చెస్ట్ ఆస్పత్రి

మూడు బ్లాకుల్లో సేవలు..

జీప్లస్ 1 భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ట్రయాజ్, పసికందుల సేవలు, అల్ట్రాసౌండ్ స్కానర్, ఈసీజీ సేవలు, ఏఆర్‌టీ సెంటర్, ఐసీటీసీ క్లినిక్, పీపీటీసీ కౌన్సెలింగ్, ల్యాబ్ ఎక్స్‌రే, పీడియాట్రిక్, సర్జికల్ ఓపీ, గైనిక్ ఓపీ, ఓబీజీ, రక్తపరీక్షలు, ఫస్ట్ ఫ్లోర్‌లో పోస్టు ఆపరేటివ్, ఆరు ఐసీయూ మంచాలు, 12 యాంటినేటల్ మంచాలు, ఇన్ బార్న్, ఔట్‌బార్న్ యూనిట్, స్టెప్‌డౌన్, ల్యాబ్, తదితర వాటికి 12 పడకలు, మరో బ్లాక్‌లో బయో మెడికల్ వేస్ట్, డీజీ సెట్, అంబులెన్స్ గ్యారేజ్, యోగా హాల్, క్యాంటీన్, రోగులకు వేచి ఉండే షెడ్డుకు కేటాయించారు.

జనరల్ ఆస్పత్రి తరహాలో సేవలందించాలి..

ప్రభుత్వ సర్వజనాస్పత్రి తరహాలో పాతూరు సీడీ ఆస్పత్రిలో సేవలందాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవి కుమార్‌ను ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిప్యూటీ సివిల్ సర్జన్‌తో పాటు మరో ఏడుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారని, వారిలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు ఉన్నారని తెలిపారు.

క్లుప్తంగా

అద్దె బస్సు ఢీకొని రైతు దుర్మరణం


వెంకటయ్య(ఫైల్)

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ఘటనలో ఓ రైతు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... ధర్మవరంలోని లక్ష్మీ చెన్నకేశవపురానికి చెందిన కుంటిమల వెంకటయ్య (59)కు భార్య పుష్పలత, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. గ్రామాల్లోని తోటలను అద్దెకు తీసుకుని ఫలసాయాన్ని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వెంకటయ్య... గురువారం ఉదయం స్థానిక సెరికల్చర్ కార్యాలయం సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం

లేపాక్షి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం పులమతి పంచాయతీ పరిధిలోని తిలక్‌నగర్‌కు చెందిన ఖలీల్ (39)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసైన ఖలీల్ రోజూ తప్పతాగి ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం కూడా భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రమైన ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. సలామత్‌నగర్ సమీపంలోని ఓ పాడుబడిన ఇంట్లో చీరతో ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న ఖలీల్‌ను గుర్తించి, సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో ఫుడ్ సేఫ్టీ మెంబర్ తనిఖీలు


పాఠశాలలో సమస్యలపై విద్యార్థులతో మాట్లాడుతున్న లక్ష్మణకుమార్

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రం గురుకుల పాఠశాలను ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ మెంబర్ గుజ్జల లక్ష్మణకుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల వాతావరణం, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. రెండు రోజులుగా కోడిగుడ్డు ఇవ్వలేదని, చికెన్ సరిగా వండడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేయడంతో వార్డెన్ నాగరాజును మందలించారు. ప్రభుత్వం అందజేస్తున్న నాణ్యమైన ఆహారం ప్రతి విద్యార్థికీ కచ్చితంగా అందజేయాలని సూచించారు.

పచ్చిరొట్టతో భూసారం మెండు


పెదపల్లి వద్ద సాగు చేసిన జీలుగ పంట


పుట్టపర్తి వద్ద వరి మడిలో ఆకు తొక్కడానికి సిద్ధం చేసిన నేల


జీలుగను నేలలో కలియ దున్నిన దృశ్యం

- భూసారం పెంపుపై విస్తృత అవగాహన సదస్సులు
- పంటల సాగులో పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై చైతన్యం
- 3,475 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై అందజేసిన ప్రభుత్వం

పుట్టపర్తి అర్బన్: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకంతో అనేక అనర్థాలు చోటు చేసుకున్నాయి. నేల భౌతిక లక్షణాలు దెబ్బతిని సారం క్రమంగా కోల్పోతోంది. సూక్ష్మ పోషక లోపాల కారణంగా పంట ఉత్పత్తులు గణనీయంగా తగ్గాయి. వ్యవసాయంలో పెట్టుబడులూ పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో నేల సహజత్వాన్ని కాపాడేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. వ్యవసాయంలో మార్పును ఆహ్వానిస్తూ అన్నదాతలకు పెద్ద ఎత్తున్న ప్రోత్సాహకాలను అందజేస్తోంది. పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంచేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా భూసారం పెంపుపై జిల్లా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు విస్తృత అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.

ఐదేళ్ల క్రితం బీడు భూములు..

గతంలో ప్రైవేటు ఎరువుల కంపెనీల ప్రకటనలు చూసి మోసపోయిన రైతులు అధిక పంట దిగుబడులు ఆశిస్తూ విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వినియోగిస్తూ వచ్చారు. ఫలితంగా భూమి తన సహజత్వాన్ని కోల్పోతూ వచ్చింది. సారం లేని భూమిలో పంటల సాగు చేపట్టిన రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతూ వచ్చారు. ఫలితంగా వ్యవసాయం భారమై ఐదేళ్ల క్రితం వరకూ చాలా వరకూ భూములు బీడుగా వదిలేసి, పట్టణ ప్రాంతాలకు వలసపోయారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ఈ క్రమంలో జల వనరుల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నారు. దీనికి తోడు ప్రకృతి సహకరించడంతో 2019 తర్వాత విస్తారంగా వర్షాలు కురిసాయి. చెరువులు, కుంటలు, నదులు జలకళను సంతరించుకున్నాయి. వలస వెళ్లిన రైతులు పల్లె బాట పట్టారు. పలుగు, పార చేతబట్టి పొలం పనుల్లో నిమగ్నం కావడంతో భూసారం పెంపుపై ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులను చైతన్య పరిచే కార్యక్రమాలను అధికారులు విస్తృతం చేశారు. ఫలితంగా రసాయన ఎరువుల స్థానంలో పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసి భూసారం పెంపుతో పాటు మంచి దిగుబడులూ సాధిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నానో యూరియా, నానో డీఏపీ వంటి లిక్విడ్ ఎరువులను అందుబాటులోకి తీసుకురావడంతో రసాయనిక ఎరువులు వినియోగం పూర్తిగా తగ్గింది.

సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు..

పచ్చి రొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసర, ఉలవ తదితర విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. వీటి సాగు చేయడం ద్వారా నేల భౌతిక స్థితితో పాటు స్థూల, సూక్ష్మ సాంద్రతలో స్పష్టమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. భూమిలో నీటి నిలువ శక్తి శాతం పెరిగింది. గాలిలో ఉండే నత్రజనిని స్థిరీకరిస్తుండడంతో పైపాటుగా వేసే నత్రజని ఎరువుల భారం తగ్గింది. భూ సారం పెరిగింది. సాధారణంగా ఎరువులు వేసినప్పుడు నత్రజని, పోటాషియం, భాస్వరం మాత్రమే అందుతాయి పచ్చిరొట్ట ఎరువులతో మొక్కలకు కావాల్సిన 16 రకాల పోషకాలు అందుతాయి. భూముల్లో చౌడు శాతం తగ్గేందుకు ఎంతో ఉపయోగపడ్డాయి. నేలలో మంచి బ్యాక్టీరియా, సూక్ష్మజీవులు, వానపాములు పెంపునకు సహకరించి భూమి ఆరోగ్యాన్ని పెంపొందించాయి. పచ్చిరొట్ట ఎరువు సాగు చేసే రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో విత్తనాలను అందజేస్తోంది. జీలుగ కిలో రూ.79 కాగా రూ.39.5 అందజేస్తుంది. అలాగే జనుము కిలో రూ.42 , పిల్లి పెసర రూ.48.5తో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఏడాది 475 మంది రైతులకు 165 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను అందజేశారు. 80 శాతం సబ్సిడీతో13,174 మంది రైతులకు 3,310 క్వింటాళ్ల ఉలవలు అందజేశారు.

భూమికి మంచిది



పచ్చిరొట్ట ఎరువుల సాగుపై ఇప్పుడిప్పుడే రైతుల్లో అవగాహన పెరుగుతోంది. మెట్ట భూమి కంటే వరిమడిలో దీని ప్రభావం త్వరగా చూపుతుంది. దీనిని సాగు చేసి మొగ్గ దశలో నేలలోకి కలియ దున్నితే మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. భూమి సారవంతమవుతుంది. ఇందులో నత్రజని, పోటాషియం, భాస్వరం అధికంగా ఉంటుంది.

– రామసుబ్బయ్య, ఏరువాక శాస్త్రవేత్త, పుట్టపర్తి

'చీనీ'ని దెబ్బతీస్తున్న 'పొలుసు'

నివారించుకోవాలన్న డీహెచ్ఓ చంద్రశేఖర్


పొలుసు పురుగు కారణంగా దెబ్బతింటున్న చెట్టు కాండం


బంక కారుతున్న చీనీ చెట్టు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల చీనీ తోటల్లో పొలుసు పురుగు ఉధృతంగా వ్యాపిస్తోందని, తక్షణమే నివారణ చర్యలు చేపట్టకపోతే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుందని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి (డీహెచ్ఓ) జి.చంద్రశేఖర్ సూచించారు. రెండు జిల్లాల పరిధిలో 50 వేల హెక్టార్లకు పైబడి చీనీతోటలు సాగులో ఉన్నందున పొలుసు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని రైతులను హెచ్చరించారు. ఈ పురుగు కాండంపై ఏర్పడి రసం పీల్చడం వల్ల బంకలా మారి చివరకు చెట్లు చనిపోతాయన్నారు.

నివారణ చర్యలు..

- పొలుసు పురుగు వ్యాప్తి చెందకుండా పంట కోత పూర్తయిన వెంటనే కత్తిరింపులు చేపట్టి గాలీవెలుతురు ప్రసరించేలా చూడాలి.
- కొమ్మ కత్తిరింపులు తర్వాత లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చెట్టు కాండంపై ఏర్పడిన బంకను కత్తితో గోకిన తర్వాత మైలుతుత్తు సున్నం పేస్టును పూయాలి.
- పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటే తొలుత ఒక లీటర్ నీటికి ఏదైనా షాంపు 3 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. మరుసటి రోజు తప్పనిసరిగా ఒక లీటర్ నీటికి 2 మి.లీ పిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి. తిరిగి 10 నుంచి 15 రోజుల మధ్యలో మరోసారి ఇదే మందును పిచికారీ చేసుకుంటే పొలుసు పురుగును సమర్థవంతగా నివారించుకోవచ్చు.

సీఎస్ఓ కృష్ణారెడ్డి అరెస్ట్

- కసాపురంలో హుండీ నగదు చోరీ కేసులో ప్రధాన నిందితుడు
- రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని హుండీ నుంచి నగదు చోరీ చేసిన కేసులో పరారీలో ఉన్న ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో ఇప్పటికే ఆలయంలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఓ అర్చకుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వివరాలను గురువారం సాయంత్రం గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరెడ్డి, కసాపురం ఎస్ఐ గోపాలుడుతో కలసి డీఎస్పీ నర్సింగప్ప వెల్లడించారు. ఈ నెల 17న వేకువ జామున హుండీలోకి కృష్ణారెడ్డి చేతులు పెట్టి నగదు చోరీ చేస్తూ సీసీ కెమెరాలకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఘటనపై ఆలయ అధికారులు ఫిర్యాదు మేరకు ఈ నెల 18న కేసు నమోదు చేసిన, పోలీసులు కృష్ణారెడ్డితో పాటు అదే రోజు హుండీలో నగదు చోరీ చేసేందుకు యత్నించిన అర్చకుడు దేశికాచారి గాలింపు చేపట్టారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న దేశికాచారిని బుగ్గసంగమేశ్వర ఆలయం వద్ద బుధవారం అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు కృష్ణారెడ్డి గురువారం సాయంత్రం గుంతకల్లు పట్టణ శివారులోని బళ్లారి రోడ్డులో ఉన్న లక్కీ డాబా వద్ద సంచరిస్తుండగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడి నుంచి రూ.13 వేలు స్వాధీనం చేసుకున్నారు. 2003లో నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుగా విధుల్లో చేరిన కృష్ణారెడ్డి తర్వాత సెక్యూరిటీ ఏజెన్సీలను ఏర్పాటు చేసి ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ స్థాయికి ఎదిగాడు. స్వామి దర్శనార్థం కసాపురం వచ్చే ఓ భక్తురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించేందుకు యత్నించిన కృష్ణారెడ్డిపై గతంలోనే పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆలయ సెక్యూరిటీ బాధ్యతల నుంచి తప్పించలేకపోయారు. ఈ క్రమంలో హుండీ కానుకలను అపహరించేందుకు ప్రయత్నించి నిఘా కెమెరాలకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడం గమనార్హం. హుండీలో నగదు చోరీ కేసులో కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి, పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛ కార్యక్రమాలు


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, న్యాయవాదులు

అనంతపురం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, మున్సిపల్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అపరిశుభ్రత అనేది అనేక వ్యాధులకు కారణమవుతుందన్నారు. మంచి పరిసరాలు మంచి ఆలోచనలకు దోహదపడతాయని, మానసిక, శారీరక, దృఢమైన సమాజం ఏర్పాటుకు పరిశుభ్రమైన వాతావరణం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులను, కోర్టు సిబ్బంది, నగర పాలక సంస్థ అధికారులను ప్రశంసించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: స్థానిక మార్కెట్ యార్డు వెనుక మట్కా రాస్తున్న నలుగురు బీటర్లను అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. పట్టుబడిన వారిలో బింగి రమేష్, చాకలి కొండయ్య, వేల్పుల శ్రీరాములు, దూదేకుల సిద్దిక్‌బాషా ఉన్నారు. నిందితుల నుంచి రూ.92,670 నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: ఉమ్మడి జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అండర్–14 బాల, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ గురువారం అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో నిర్వహించారు. ఎంపికలను జిల్లా టెన్నిస్ క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి అన్వర్ బాషా పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. బాలుర జట్టుకు మోక్షిత్, అన్నీస్, తనోజ్, నిఖిత్, లిఖిత్, నవీన్, హార్దిక్, శశాంక్, భవదీప్, చైతన్య, తేజేశ్వర్, నేహల్, విలాస్, మహిదర్, రిత్విక్, అభయకుమార్, జితేంధర్, శ్రీచరణ్, పార్థు, పరమేష్, హరీష్ జునైద్, రఘునందన్, ప్రణీత, యశ్వంత్ నాయక్, అఫ్జల్, కులదీప్‌నాయక్, షాకీర్, గోహన్, జశ్వంత్, పూజిత్, ప్రేమ్ చరణ్, భానువర్ధన్, పవన్, విన్సెంట్, మోహిత్, ధ్రువ, తేజనాథ్, చారిత్, నేహన్ హంజా, సాయి చరణ్, ప్రణీత్ నాయుడు, భాను, వెంకట కృష్ణ ఎంపిక కాగా, బాలికల జట్టులో సిద్ధిక్ష, కార్తీక, లాస్య, గీత, సుకాంశ, అనుదీప, రాజేశ్వరి, హబీదా, షాహీదా, శిరీష, రెహన, చాందిని, అభినేత్రి, నవదీప చోటు దక్కించుకున్నారు.

బిల్లు ఆమోదంపై కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం

కళ్యాణదుర్గం: కాంట్రాక్టు ఉద్యోగుల బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీఓ భవనంలో గురువారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో తాలూకా కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. 22 ఏళ్లుగా నలుగుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఏపీ ఎన్జీఓ నాయకులు ఫార్మసిస్ట్ మహేష్, కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్ జాన్సన్, యూనియన్ నాయకులు నర్సారెడ్డి, గంగరాజు, పురుషోత్తం, వీరశేఖర్, హనుమంతరాయుడు, గోవిందరాజులు, నారాయణ తదితరులు ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు నారాయణ, తిప్పేస్వామి, గోవిందరాజులు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధాబాల్లో సెబ్ అధికారుల తనిఖీలు


ధాబా నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న సెబ్ సీఐ విజయ్‌కుమార్

తాడిపత్రి అర్బన్: సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు తాడిపత్రి పరిసర ప్రాంతాల్లోని పలు ధాబాల్లో సెబ్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రూరల్ పరిధిలోని ఫ్రెండ్స్ ధాబాలో మద్యం సేవిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల తాడిపత్రి ప్రాంతంలోని ధాబాల్లో అక్రమంగా మద్యం విక్రయించడంతో పాటు తాగేందుకూ అవకాశం కల్పిస్తున్నారన్న పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ధాబాల్లో మద్యం విక్రయాలు సాగిస్తూ సేవించడానికి అనుమతిస్తే సీజ్ చేస్తామని నిర్వాహకులకు జారీ చేసినట్లు వివరించారు.

కుక్కలకు రేబిస్ టీకాలు


కుక్కకు సంతాన నియంత్రణ ఆపరేషన్ చేస్తున్న పశువైద్యులు

బత్తలపల్లి: పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రపంచ రేబిస్ వ్యాధి నియంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బత్తలపల్లిలోని పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలను వేసి, మాట్లాడారు. కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయడంతో పాటు సంతాన నియంత్రణకు ఆపరేషన్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీధి కుక్కల దాడి ఎక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో రేబిస్ వ్యాధి ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగానే కుక్కలకు టీకాలు వేయించడం ద్వారా రేబిస్ వ్యాధిని నియంత్రించవచ్చునన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ గుర్నాథరెడ్డి, సిబ్బంది సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న బస్సు

- 10 మంది ప్రయాణికులకు గాయాలు

రామగిరి: రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళుతున్న ఓ కంటైనర్ బుధవారం రాత్రి ఎన్ఎస్‌గేట్ సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారి పక్కన డ్రైవర్ ఆపి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కర్నూలు జిల్లా ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు 34 మంది ప్రయాణికులను తీసుకెళుతున్న డ్రైవర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను గమనించకుండా వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో పది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న రామగిరి ఎస్ఐ జనార్దననాయుడు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బిడ్డతో సహా చెరువులో దూకిన తల్లి – చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి చంద్రశేఖర్

తలుపుల: మండల కేంద్రంలోని బలిజపేటకు చెందిన చాకలి నాగమణి, తన 19 నెలల వయసున్న కుమారుడు చంద్రశేఖర్‌తో కలసి మాడికవాండ్లపల్లి గ్రామ సమీపంలోని ఎర్ర చెరువులో గురువారం దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడికి సమీపంలోనే బర్రెలు మేపుతున్న వారు గమనించి కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి, అక్కడకు చేరుకునేలోపు చిన్నారి గల్లంతయ్యాడు. నాగమణిని వెలికి తీసి, సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. కానిస్టేబుల్ ఈశ్వర్ నాయక్ చెరువులోకి దూకి లోతట్టు ప్రాంతం నుంచి చిన్నారి మృతదేహాన్ని వెలికి తీసుకువచ్చాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, అఘాయిత్యానికి కారణాలు తెలియాల్సి ఉంది.

వేడి చారులో పడి చిన్నారికి తీవ్ర గాయాలు


గాయపడిన చిన్నారి గోవర్ధన్

బ్రహ్మసముద్రం: మండలంలోని పోలేపల్లికి చెందిన వడ్డే కావేరమ్మ, మంజు దంపతుల రెండేళ్ల వయసున్న కుమారుడు గోవర్ధన్ ప్రమాదవశాత్తు వేడి చారు (రసం)లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు.

పెన్నహోబిలం బ్రిడ్జి పరిశీలన

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం వద్ద ఉన్న వందేళ్ల నాటి పురాతన ఐరన్ బ్రిడ్జిని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన బ్రిడ్జిని జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నిర్మించారు. దీంతో ఈ వంతెకు సంబంధించిన ఇనుప సామగ్రిని మరో స్థానంలో వంతెన నిర్మాణంలో పునః వినియోగానికి అనుకూలంగా ఉందా? లేదా? అనే అంశంపై నిపుణులతో చర్చించారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, ఎన్‌హెచ్ ఈఈ మధుసూదన్, తహసీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం: అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారంతో సెబ్ ఏఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు ఇంటిలిజెన్స్ సీఐ నరసానాయుడు, సెబ్ సిబ్బంది కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి వద్ద గురువారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారులో రెండు బాక్సుల ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ (96 సీసాలు), 6 బాక్సుల్లో 72 నాక్ అవుట్ బీరు బాటిళ్లు బయటపడ్డాయి. కర్ణాటక నుంచి వీటిని అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్నట్లుగా గుర్తించారు. మద్యం తరలిస్తున్న తిమ్మసముద్రం నివాసి ఎరికల రవీంద్ర అలియాస్ రాజు, పాలవాయి గ్రామానికి చెందిన సుగాలీ గోవర్ధన్ నాయక్‌ను అరెస్ట్ చేశారు.